సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 17 । జనవరి । 2025



కాలయాపన

గల్ఫ్ బోర్డు కోసం సలహా కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం కాల యాపన చేస్తుందనే విమర్శలు వస్తున్నాయి.

- 8లో ▸



85,526 కుటుంబాలు

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కోసం సుమారు 85526 కుటుంబాలను అర్హత కలిగినవిగా అధికారులు గుర్తించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 /15.5

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జీజీహెచ్‌ను తనిఖీ చేసిన సూపరింటెండెంట్



నిజామాబాద్‌నాగారం : జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)ని నూతన సూపరింటెండెంట్ డాక్టర్ పి శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. జీజీహెచ్‌లో ఓపీ, ఎక్స్‌రే, స్కానింగ్, అనాథ రోగుల (లావారీస్), ఎమర్జెన్సీ విభాగం, జనరల్‌వార్డు తదితర విభాగాలను స్వయంగా పరిశీలించారు. నర్సింగ్, వైద్యులతో మాట్లాడుతూ తన మొదటి ప్రాధాన్యత రోగులకు ఉత్తమ సేవలందించడమే అన్నారు. ఆయన వెంట డాక్టర్ జలగం తిరుపతిరావు, ఆయా విభాగాల అధికారులు ఉన్నారు.

ఈ నెల 22, 29 తేదీల్లో సదరం క్యాంపులు

డొంకేశ్వర్(ఆర్మూర్) : సదరం క్యాంపులు ఈ నెల 22, 29 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకే మీసేవ కేంద్రాల్లో సదరం స్లాట్‌ను బుక్ చేసుకున్న వారి మొబైల్ ఫోన్‌కు ఎస్ఎంఎస్ వస్తుందని, అందులో సూచించిన తేదీల్లో సదరం క్యాంపునకు దివ్యాంగులు హాజరుకావాలని కోరారు.. స్లాట్ బుక్ చేసిన రశీదుతో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్ కార్డు, మెడికల్ రిపోర్టులు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు. సదరం సర్టిఫికెట్ గడువు ముగిస్తే త్వరగా రెన్యువల్ చేసుకోవాలని లేకపోతే ప్రభుత్వం అందించే పింఛను నిలిచిపోతుందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఖలీల్‌వాడి : వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, దీంతో ప్రమాదాలు తగ్గుతాయని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పరిమళ ఆన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌ఫోర్టు కార్యాలయంలో నిర్వహించిన రహదారి భద్రత అవగాహన సదస్సులో ఆమె మాటాడారు. వాహనాదారులు వాహనాలపై వెళ్లేటప్పుడు సీటు బెల్టు, బైక్ పై వెళ్లేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. రోడ్డుపై నిర్ణీత స్పీడ్ పై వెళ్లాలన్నారు. జాతీయరహదారిపై బైక్ పై వెళ్లే వారు కేటాయించిన దారిలో వెళ్లాలన్నారు. రహదారి భద్రతపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీటీవో ఉమామహేశ్వర్‌రావు, ఎంవీఐలు రాహుల్, కిరణ్, నీలిమా, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి



పెర్కిట్(ఆర్మూర్): సొసైటీలు రైతులకు సకాలంలో ఎరువులను అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ సూచించారు. ఆలూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని వాజీద్ హుస్సేన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవోఎస్ యంత్రం ద్వారా ధాన్యం కొనుగోలు జరపాలని సూచించారు. అలాగే సొసైటీలో క్రయా విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మల్లేష్, సిబ్బంది ముత్యం, దేవరాజు, గంగారాం, రైతులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశామని ప్రిన్సిపాల్ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ 8, అసోసియేట్ ప్రొఫెసర్ 2, అసిస్టెంట్ ప్రొఫెసర్ 28, ట్యూటర్ 4, జూనియర్ రెసిడెంట్ 18, సివిల్ అసిస్టెంట్ సర్జన్ 7 పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఈ నెల 17 నుంచి 20 వరకు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు. ఈ నెల 20న ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, 21న ఫైనల్ ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

వీరన్నగుట్టలో ఆడ, మగ నారును వేరు చేస్తున్న కూలీలు



ఆడ, మగ సాగు..

ఆదాయం మెండు

- పోటీపడుతున్న ప్రైవేట్ కంపెనీలు
- బోధన్ నియోజకవర్గంలో సుమారు రెండు వేల ఎకరాల్లో పంట
- ఎక్కువ కష్టం.. రాబడి అధికం

రెంజల్(బోధన్) : బోధన్ నియోజకవర్గంలో ఆడ, మగ వరి సాగుకు ఆదరణ పెరుగుతోంది. మల్టీ నేషనల్ కంపెనీలు పోటీపడి రైతులతో ఒప్పందం చేసుకుంటున్నాయి. పలు రకాల కంపెనీలు రైతులకు నూతన పద్ధతులను ప్రోత్సహిస్తూ పంట సాగును యోటా పెంచుతున్నాయి. రైతులతో ముందుగా ఒప్పందం చేసుకుని విత్తనోత్పత్తి నుంచి పంట నూర్పిడి వరకు అవసరమైన సలహాలు, సూచనలను ఆయా కంపెనీల ప్రతినిధులు అందిస్తున్నారు. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు పండిస్తే 80 నుంచి 90 వేల వరకు, పది కంటే ఎక్కువ పండిస్తే అదనంగా క్వింటాకు ధరను చెల్లిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. విత్తనంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణంలో మార్పులు, చీడపీడలు వచ్చి పంట దిగుబడి తగ్గినా రైతుకు ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం చెల్లిస్తున్నారు. రైతు నిర్లక్ష్యంతో కలుపుతీత, బెరుకులు వస్తే కంపెనీ ప్రతినిధులు ధరను తగ్గించి తీసుకుంటున్నారు. పలు రకాల వెరైటీలను రైతులు సాగు చేస్తున్నారు. ఒక్కో రైతు ఒక్కో కంపెనీ నిబంధనల ప్రకారం వారు సూచించిన విధంగా సాగు చేయాల్సి ఉంటుంది.

నాటు ప్రత్యేకత

ఆడ, మగ నాటు ప్రత్యేకంగా ఉంటుంది. నారు మడి వచ్చిన తర్వాత నిబంధనల ప్రకారం కర్రలు, తాళ్లతో కొలతలు చేసి రెండు లైన్లను మగ, మధ్యలో ఐదు లైన్లను ఆడ నారును విత్తుకునాలి. లేదంటే ఎక్కడ లోపం తలెత్తినా ధాన్యం మొత్తం తాలుగా మారుతుంది. పద్ధతి ప్రకారం నాటడం వల్ల పూత దశలో ఈ రెండింటిని సంకరం చేయాల్సి ఉంటుంది. చేతికి వచ్చిన తర్వాత ముందుగా మగ వరి సాళ్లను కోసి పక్కన పెడతారు. తర్వాత ఆడ వరిలో బెరుకులు ఉంటే తొలగించాలి. కంపెనీలు కేవలం ఆడ ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తారు, మగ ధాన్యాన్ని రైతులు ఇష్టం వచ్చిన వారికి విక్రయించుకునాలి.



కళ్యాపూర్‌లో నాటు వేస్తున్న కూలీలు

రెండు, మూడు సంవత్సరాల నుంచి ఈ ప్రాంతంలో ఆడ, మగ వరిని అంతంత మాత్రంగానే సాగు చేస్తుండగా ఈ సీజన్‌లో కంపెనీలు పోటీపడటంతో ఎక్కువ విస్తీర్ణంలో సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు.

రూ. 70 వేల నుంచి..

పంట సాగు పద్ధతుల్లో ఎక్కువ కష్టం ఉన్నా అందుకు తగిన విధంగా ఆదాయం రైతుకు లభిస్తోంది. సాధారణ వరి రకాలకు ఎకరాకు రూ. 25 వేల నుంచి రూ. 35 వేల వరకు ఆదాయం వస్తే ఈ పద్ధతిలో సాగు చేసిన పంటకు రూ. 70 వేల నుంచి లక్ష వరకు ఆదాయం పొందవచ్చు. ప్రత్యేక పద్ధతుల ద్వార మొదటి నుంచి చివరి వరకు రైతు దగ్గరుండి తగిన జాగ్రత్తలు తీసుకునాల్సి ఉంటుంది. ఆడ, మగ విత్తనాలకు వేర్వేరుగా నారుమడులు వేయాల్సి ఉంటుంది. ముందుగా మగ నారు మడి వేసిన వారం రోజులకు ఆడ నారుమడిని సిద్ధం చేయాలి. అయిదు వరసల్లో ఆడ, మూడు వరుసల్లో మగ నారుమడులు వేసుకునాల్సి ఉంటుంది. 21 రోజుల్లో నాట్లు ప్రారంభించాలి. నాట్లు పూర్తయిన తర్వాత కంపెనీ సిఫారసు చేసిన ఎరువులు, పురుగుమందులను వినియోగించాలి.

మల్టీనేషనల్ కంపెనీలు..

బోధన్ ప్రాంతంలో మల్టీనేషనల్ కంపెనీలు పోటీపడుతున్నాయి. మార్కెట్‌లోకి అనేక రకాల కంపెనీల వచ్చాయి. బోధన్ ప్రాంతంలో మాత్రం అడ్వాంటో, సింగాట్, కావేరి కంపెనీలు రైతులను ప్రోత్సహిస్తున్నాయి. ఇవే కాకుండా నూజీవీడు, బేయర్, అన్నపూర్ణ తదితర కంపెనీలు పనిచేస్తున్నాయి.

కంటికి రెప్పలా కాపాడుకోవాలి



పంటను కంటికి రెప్పలా కాపాడుకునాలి. నిర్లక్ష్యం చేస్తే నష్టం వస్తుంది. సింగాట్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నాను. ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తే అదనపు ఆదాయం వస్తుంది. కంపెనీ సూపర్‌వైజర్లు చెప్పినట్లు పనులు చేయాల్సి ఉంటుంది. 20 ఎకరాల్లో పంటను సాగు చేస్తున్నాను.

–ఆర్మూర్ లడ్డు, రైతు, రెంజల్

10 ఎకరాల్లో సాగు



మొదటిసారి ఆడ(ఫిమేల్), మగ(మేల్) రకం పంటను సాగు చేస్తున్నాను. ప్రస్తుతం ఈ సీజన్‌లో 10 ఎకరాల వరకు నాట్లు పూర్తి చేశాను. ఒప్పందం ప్రకారం పంట పండితే ఒక విధంగా, విత్తనం, ప్రకృతి అనుకూలించకుంటే మరో రకంగా ఆదాయం లభిస్తుంది. సాధారణ వరి రకాల సాగు కంటే ఈ సాగు భిన్నంగా ఉంటుంది. కూలీలపై ఆధారపడకుండా పర్యవేక్ష చేయాల్సి ఉంటుంది.

–ఒడ్డెక్క మోహన్, రైతు కళ్యాపూర్

98 గ్రామాల గుర్తింపు

- మొదలైన రైతు భరోసా సర్వే
- పాల్గొన్న వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు
- సాగులో లేని భూముల గుర్తింపు



జీజీ నడ్కుడలో సర్వే చేస్తున్న అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు భరోసా సర్వే గురువారం మొదలైంది. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు కలిసి షెడ్యూల్ ప్రకారం సంబంధిత గ్రామాల్లో సర్వేను నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన లిస్టు ప్రకారం సర్వే నంబర్ల ఆధారంగా సంబంధిత రైతుల వద్దకు వెళ్లి సాగు భూమి ఉందో లేదో పరిశీలించారు. రాళ్లు,గుట్టలు, నాల కన్వర్షన్, నిర్మాణాలు, భూ సేకరణ, లేఅవుట్, సాగు యోగ్యం కాని భూముల వివరాలను నమోదు చేసుకున్నారు.

జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సిరికొండ, ధర్పల్లి మండలాల్లో పర్యటించి సర్వేను పరిశీలించారు. అలాగే ఆయా మండలాల్లోని గ్రామాల్లో ఏఈవోలు చేప డుతున్న సర్వేను మండల ప్రత్యేక అధికారులు, మండల వ్యవసాయాధికారులు, తహశీల్దార్లు, డి ప్యూటీ తహశీల్దార్లు, ఆర్ఐలు, సర్వేయర్లు పరిశీల న చేశారు. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 98 గ్రా మాల్లో సర్వే పూర్తయినట్లు వ్యవసాయ శాఖ వెల్ల డించింది.డొంకేశ్వర్ మండలం జీజీ నడ్కుడ, గాదేపల్లి, కోమట్‌పల్లి, నికాల్‌పూర్ గ్రా మాల్లో సర్వేను డిప్యూటీ తహశీల్దార్ వసంత్, మండల వ్యవసాయా ధికారి మధుసూదన్‌లు పర్యవేక్షించారు.

సమగ్ర వివరాలను సేకరించాలి

- అర్హులైన వారికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- ధర్పల్లి, సిరికొండ మండలాల్లో ఫీల్డ్ వెరిఫికేషన్ పరిశీలన

ధర్పల్లి/సిరికొండ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలనలో సమగ్ర వివరాలను సేకరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. గురువారం ధర్పల్లి మండలంలోని దుబ్బాక, డీబీ తండాలో, సిరికొండ మండల కేంద్రంతో పాటు పెద్ద వాల్గొట్, మైలారం గ్రామంలో అధికారులు చేపట్టిన ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించే తీరు, ఏ అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారో సేకరించిన అంశాలను రిజిస్టర్లలో నమోదు ప్రక్రియను కలెక్టర్ తనిఖీ చేశారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఫీల్డ్ వెరిఫికేషన్ వేగవంతంగా నిర్వహించాలన్నారు. ఆధార్ కార్డు, ప్రజా పాలన దరఖాస్తులు, సామాజిక ఆర్థిక సర్వే వివరాలతో క్షేత్రస్థాయి పరిశీలన వివరాలను సరి చూసుకోవాలన్నారు. రైతు భరోసా పథకానికి సంబంధించి నాలా కన్వర్షన్, భూసేకరణ, లేఅవుట్, వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములను సర్వే నెంబర్ల వారీగా పరిశీలించాలన్నారు. భూభారతి (ధరణి) పోర్టల్, గూగుల్ మ్యాప్‌ల ఆధారంగా వాస్తవ వివరాలను నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియను ఈనెల 20 నాటికి అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలన్నారు. అర్హుల జాబితా రూపకల్పనలో ఏమైనా సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించి నివృతి చేసుకోవాలని ఫీల్డ్ వెరిఫికేషన్ బంద్రాలకు కలెక్టర్ సూచించారు. గ్రామాలలో రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న ఫీల్డ్ వెరిఫికేషన్ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన బంద్రాల పనితీరును ఆర్డీవోలు, తహశీల్దార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులైన కుటుంబాలను గుర్తించే సమయంలో పాత రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు లేకుండా క్షుణ్ణంగా పరిశీలన జరపాలన్నారు. కలెక్టర్ వెంట ఆయా మండలాల్లో నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, తహశీల్దార్లు మాలతి, రవీందర్, ఎంపీడీవో మనోహర్ రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ నాగారావు, ఏవో వెంకటేష్, ఆర్ఐ రాజేశ్వర్ ఉన్నారు.



మైలారంలో అధికారులకు సర్వేపై సూచనలు చేస్తున్న కలెక్టర్ హనుమంతు

పసుపు బోర్డులో కాంగ్రెస్‌ది కీలకపాత్ర



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- మంత్రి తుమ్మలపై ఎంపీ అర్వింద్ వ్యాఖ్యలు అభ్యంతరకరం
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ సిటీ: జాతీయ పసుపు బోర్డు ఏర్పాటులో కాంగ్రెస్ పాత్ర కీలకమని, నిజామాబాద్‌లో బోర్డు ఏర్పాటు చేయడం అభినందనీయమని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పసుపు బోర్డు ఏర్పాటు కోసం మూడు దశాబ్దాలుగా పసుపు రైతులు ఎన్నో పోరాటాలు చేశారని, ఒక్క బీజేపీ వల్ల మాత్రమే బోర్డు రాలేదన్నారు. పసుపు బోర్డు కోసం రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖ మంత్రి కేంద్రానికి లేఖలు రాశారని గుర్తుచేశారు. జిల్లాకేంద్రంలోని ఆర్యనగర్‌లో స్పైసెస్ బోర్డు పేరుతో కార్యాలయం తెరచి, ఎలాంటి కార్యకలాపాలు చేయలేదన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన పసుపుబోర్డు కార్యాచరణ ఉంటుందా లేక కేవలం నామమాత్రమేనా అనే సందేహం వ్యక్తమవుతుందన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై ఎంపీ అర్వింద్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ జైలుకెళ్లడం ఖాయంగా కనిపిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 తర్వాత మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, ఐసీడీఎంఎస్ చైర్మన్ తారాచంద్, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, మునిపల్లి సాయిరెడ్డి, విపుల్‌గౌడ్, బోర్గాం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్‌కు ధన్యవాదాలు తెలుపుతూ..

నిజామాబాద్ సిటీ : నగరంలో గురువారం ఉదయం ఎంపీ అర్వింద్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ఫ్లెక్సీలు వెలిశాయి. పలు కూడళ్లలో '68 ఏళ్ల ఓ పసుపు రైతు' పేరిట ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కంఠేశ్వర్ చౌరస్తా, మున్సిపల్ చౌరస్తా, కోర్టు చౌరస్తా, వినాయక్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద ఫ్లెక్సీలు పెట్టారు. అర్వింద్ మొండి పట్టున్న నాయకుడని, పట్టుబట్టి పసుపు బోర్డు సాధించాడని, నిజామాబాద్ మరో 30 ఏళ్లు నీ అడ్డా.. ఎప్పటికీ నిను మరువదు ఈ గడ్డా అని ఫ్లెక్సీల్లో పేర్కొన్నారు.



నగరంలో వెలసిన ఫ్లెక్సీ

కమీషన్ల పంపకాల్లో అక్రమాలు

- ఆరోగ్యశ్రీకి సంబంధం లేని ఉద్యోగులకు చెల్లింపులు
- సంబంధిత ఉద్యోగికి ఇన్సెంటీవ్ రాక గగ్గోలు
- జీజీహెచ్‌లో 'భజన బ్యాచ్' ఆగడాలు



నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీని అభాసుపాలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు సేవలందిస్తున్నందుకు సిబ్బందికి ప్రభుత్వం ప్రతి మూడు నుంచి ఆరు నెలల లోపు కమీషన్‌లు ఇస్తుంది. వాటిని ఆరోగ్యశ్రీ థియేటర్‌లో విధులు నిర్వహించే సిబ్బందికి చెల్లింపులు చేయాలి. కానీ జీజీహెచ్‌లో ఇందుకు పూర్తి విరుద్ధంగా నడుస్తుంది. విధులు నిర్వహించకున్నా కొందరికి చెక్కుల రూపంలో ఒక్కొక్కరికి రూ. 20వేలకు పైగా చెల్లింపులు చేశారని తోటి ఉద్యోగులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. కానీ సంబంధిత ఉద్యోగికి రావాల్సిన ఇన్సెంటీవ్ రాక అందరి ఎదుట గగ్గోలు పెట్టుకోవడం జీజీహెచ్‌లో హాట్‌టాఫిక్‌గా మారింది.

35శాతం నిధులు సిబ్బందికి..

నిజామాబాద్ జీజీహెచ్‌లో ఆరోగ్య శ్రీ ద్వారా పలు విభాగాల్లో రోగులకు సేవలందిస్తున్నారు. ఈక్రమంలో సిబ్బందిని ప్రోత్సహించడానికి ఇన్సెంటీవ్‌లను ప్రభుత్వం అందిస్తుంది. ఆపరేషన్ థియేటర్‌లో విధులు నిర్వహించిన వైద్యులకు, నర్సులకు, ఇతర కిందిస్థాయి సిబ్బందికి ఏళ్ల తరబడిగా ఇస్తున్నారు. ఇందులో 45శాతం ఆస్పత్రి డెవలప్‌మెంట్‌కు, 55 శాతంలో నుంచి 20శాతం ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు, మిగిలిన 35శాతంలోనుంచి విధులు నిర్వహించిన డాక్టర్లకు, నర్సులకు, ఇతర సిబ్బందికి చెల్లింపులు చేస్తారు. సంబంధిత అధికారులు సుమారు ఆరు నెలల క్రితమే వైద్యులకు ఇన్సెంటీవ్‌లు అందజేయగా, స్టాఫ్ నర్సులకు మాత్రం ఆలస్యంగా చెల్లించారు. ఆరోగ్య శ్రీ తాత్కాలిక ఉద్యోగికి ఒక్కో ఆరోగ్యక్లెయిమ్ గాను రూ. 400చొప్పున రావాల్సి ఉంది. అంటే సుమారు రూ. 1లక్ష50 వేలకు పైగా రావాల్సి ఉంది. అధికారులను ఎన్నిసార్లు అడిగినా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

కలెక్టర్ దృష్టి సారించాలి..

గత జీజీహెచ్ సూపరింటెండెంట్ భజన బ్యాచ్ సుమారు 20మంది వరకు ఉంటారు. వీరికి ఆరోగ్య శ్రీకి ఎలాంటి సంబంధం లేదు. అయినా వారికి ఇన్సెంటీవ్‌లు ఇస్తారు. నిబంధనలకు విరుద్ధంగా అధికారి ఆదేశాల మేరకు వారికి చెల్లింపులు చేయడం జీజీహెచ్‌లో చర్చనీయంశంగా మారింది. అలాగే భజన బ్యాచ్‌లోని ఉద్యోగే మహిళ ఉద్యోగులను వేధిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కలెక్టర్ జీజీహెచ్ ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీకి చైర్మన్‌గా ఉంటారు. ఈక్రమంలో జీజీహెచ్‌లో నెలకొన్న అక్రమాలపై దృష్టిసారించాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఆరోగ్యశ్రీలో జరుగుతున్న అక్రమాలపై ఇప్పటికే ఉన్నతాధికారులు, నిఘా విభాగాలు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. కలెక్టర్ ఒకసారి సమీక్షిస్తే నిజాలు ఇట్టే తెలుస్తాయని సిబ్బంది పేర్కొంటున్నారు.

రికార్డులు పరిశీలిస్తా..

నేను బాధ్యతలు స్వీకరించి మూడు రోజులు అవుతుంది. ఇంకా నాకు రికార్డ్స్ ఇవ్వలేదు. ఆరోగ్యశ్రీలో ఎలాంటి చెల్లింపులు జరిగాయో అని తెలుసుకోవడానికి రికార్డులు పరిశీలిస్తాను. మహిళ ఉద్యోగులపై వేధింపులపై ఎలాంటి ఫిర్యాదు రాలేదు. వేధించినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాను.

–పి శ్రీనివాస్, జీజీహెచ్ సూపరింటెండెంట్

ఉత్తమ ఫలితాల కోసం కసరత్తు

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ

జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణత శాతం

సంవత్సరం	ఉత్తీర్ణత
2021-22	92.84
2022-23	87.11
2023-24	93.72

నిజామాబాద్ అర్బన్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించి నవంబర్ నుంచి అమలు చేస్తున్నారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది మొత్తం 23,835 మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 12,162 మంది ఉన్నారు. ప్రభుత్వ బడుల్లో నూరు శాతం ఉత్తీర్ణత కోసం అధికారులు చర్యలు చేపట్టారు. డిసెంబర్ వరకు సిలబస్ పూర్తి చేశారు. అప్పటి నుంచి నిత్యం రివిజన్ చేస్తూ వారానికి ఓ సారి పరీక్షలు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ కోసం మండల విద్యాశాఖ అధికారులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రణాళిక అమలుపై దృష్టి సారించారు. ఉదయం, సాయంత్రం స్పెషల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక ప్రణాళిక : అశోక్, డీఈవో

జిల్లాలో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు తీసుకు వచ్చేందుకు చర్యలు చేపట్టాం. అన్ని పాఠశాలల్లో ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నాం. స్పెషల్ క్లాస్‌లు నిర్వహిస్తూ.. పరీక్షల ఆధారంగా విద్యార్థుల నైపుణ్యాన్ని అంచనా వేసి బోధన చేపట్టాలని సూచించాం.

క్లుప్తంగా

25లోపు అడ్మిషన్ రెన్యూవల్ చేసుకోండి

నిజామాబాద్ అర్బన్: బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ తృతీయ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్‌ను ఈనెల 25లోపు రెన్యూవల్ చేసుకోవాలని కో–ఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ ద్వితీయ సంవత్సరం కూడా రెన్యూవల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్, డిగ్రీ రెండవ సంవత్సరం సెమిస్టర్, మూడవ, ఐదవ సంవత్సరం రీఅడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు కూడా ఈ నెల 30లోపు పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. 500 రూపాయల అపరాధ రుసుముతో వచ్చే నెల 10వరకు చెల్లించవచ్చన్నారు. అలాగే యూజీ మూడవ సంవత్సరం ఐదవ సెమిస్టర్ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి ఆరో తేదీ వరకు, రెండవ సంవత్సరం మూడో సంవత్సరం సెమిస్టర్ పరీక్షలు మార్చి 7నుంచి 13వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు మార్చి 15నుంచి 21వరకు ఉంటాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ ఉద్యోగార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ కోఆర్డినేటర్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన అభ్యర్థులు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 9వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీలలో వచ్చిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. మిగతా వివరాలకు 8639002255ను సంప్రదించాలన్నారు.

చైనా మాంజాతో ఒకరికి గాయాలు



భిక్కనూరు: మండల కేంద్రంలో చైనా మాంజాతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన మ్యాదరి సిద్దరాములు తన బైక్‌పై గురువారం సిద్దరామేశ్వరాలయం రోడ్డు మీదుగా వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఎగురవేసిన పతంగికి సంబంధించిన చైనా మాంజా అతని గొంతుకు అడ్డుగా వచ్చి కోసుకుంటూ వెళ్లింది. దీంతో ఆయన గొంతు వద్ద తీవ్ర గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. స్థానికులు వెంటనే ఆయనను ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు చికిత్స నిర్వహించారు.

స్టడీ టూర్‌లో డీసీసీబీ ప్రతినిధులు



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్లు, అధికారులు స్టడీ టూర్‌లో భాగంగా గురువారం సిమ్లాకు వెళ్లారు. డీసీసీబీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వారు బయలుదేరారు. కో–ఆపరేటివ్ బ్యాంకింగ్ రంగంలో అవలంబిస్తున్న విధానాలు, రైతులకు అందించే సేవల గురించి తెలుసుకునేందుకు స్టడీ టూర్‌కు వెళ్లినట్లు వారు తెలిపారు.

జిల్లా ఫైర్ ఆఫీసర్‌గా పరమేశ్వర్

ఖలీల్‌వాడి: జిల్లా ఫైర్ ఆఫీసర్‌గా టి పరమేశ్వర్‌ను నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన గౌతమ్ హైదరాబాద్‌లోని హైడ్రాకు బదిలీ కాగా, సిద్దిపేట స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పరమేశ్వర్‌కు పదోన్నతి కల్పిస్తూ నిజామాబాద్‌కు బదిలీ చేశారు. ఆయన నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.

సలహా కమిటీ ఏర్పాటులో కాలయాపన

- గల్ఫ్ బోర్డు ఏర్పాటు కోసం సలహా కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం
- మూడు నెలల క్రితమే ఉత్తర్వులు
- కమిటీ సభ్యుల నియామకం కోసం అడుగులు ముందుకు పడని వైనం
- సలహా కమిటీని నియమిస్తేనే బోర్డు ఏర్పాటుకు మార్గం సుగమం



మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమం కోసం నిర్దేశించిన బోర్డు విధి విధానాలు ఖరారు చేయడానికి సలహా కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందనే విమర్శలు వస్తున్నాయి. గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల సాయం, వలస కార్మికుల గోడు వినడానికి ప్రవాసీ ప్రజావాణి, వలస కార్మికుల పిల్లలకు గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సీట్ల కేటాయింపులు, సలహా కమిటీ ఏర్పాటు చేసి బోర్డు ఆవిర్భావానికి మార్గం సుగమం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సలహా కమిటీలో వలస కార్మికుల సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాజకీయ నాయకులకు చోటు దక్కే అవకాశం ఉంది. రాష్ట్ర స్థాయిలో ఏర్పడే సలహా కమిటీ ద్వారానే గల్ఫ్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం అంకురార్పణ చేసే అవకాశం ఉంది. మొదటి నుంచి వలస కార్మికుల సంక్షేమంపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సుముఖంగానే ఉంది. ఏకంగా బోర్డును ఏర్పాటు చేయకుండా దశల వారీగానే వలస కార్మికుల వినతులను పరిష్కరిస్తోంది. కేరళ, పంజాబ్ తదితర రాష్ట్రాలలో వలస కార్మికుల కోసం అమలవుతున్న పథకాలను మన రాష్ట్రంలోనూ అందించడానికి ప్రత్యేకంగా గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాలు మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నాయి. గల్ఫ్‌బోర్డుతో పాటు ప్రవాసీ విధానం(ఎన్ఆర్ఐ పాలసీ) అమలు చేస్తే గల్ఫ్ దేశాలతో పాటు ఇతర దేశాల్లో ఉపాధి పొందుతున్న వలస కార్మికుల కోసం ప్రభుత్వం ఏవైనా పథకాలను అందించడానికి అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ అన్ని అంశాలపై అధ్యయనం గతంలో జరిగినా ఈ ప్రభుత్వం వాటిని పరిగణనలోకి తీసుకోకుండా సలహా కమిటీని ఏర్పాటు చేసి కమిటీ సూచనలను పాటిస్తామని ప్రకటించింది. సలహా కమిటీని ఇప్పటికీ ఏర్పాటు చేయకపోవడంతో గల్ఫ్ బోర్డు ఆవిర్భావ ప్రక్రియ ఆలస్యమవుతోందని అంటున్నారు.

వలస కార్మికులతో జరిగే లబ్ధిని దృష్టిలో ఉంచుకొని..

వలసల ద్వారానే రాష్ట్రానికి, కేంద్రానికి ఆదాయ మార్గాలు మెరుగవుతున్నాయి. మన రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాలకు సుమారు 15 లక్షల మంది వలస వెళ్లి ఉంటారని అంచనా. సమగ్ర సర్వే వివరాలు వెల్లడైతే గల్ఫ్ దేశాలకు ఎంత మంది వలస వెళ్లి ఉంటారనే సంఖ్య తేలే అవకాశం ఉంది. గల్ఫ్ దేశాల నుంచి వలస కార్మికులు ప్రతి నెలా వారి వేతనం ఇంటికి పంపిస్తుండటంతో రెండు ప్రభుత్వాలకు ఆదాయం పెరుగుతోంది. వలస కార్మికులతో వచ్చే ఆదాయం వల్ల లబ్ధిపొందుతున్న ప్రభుత్వాలు వారి సంక్షేమంపై దృష్టి సారించకపోవడం విచారకరమనే భావన వ్యక్తం చేస్తున్నారు. సలహా కమిటీ ఏర్పాటుపై ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

85,526 కుటుంబాలు

- 'ఆత్మీయ భరోసా'కు లెక్కలు తీసిన గ్రామీణాభివృద్ధి శాఖ
- భూమి లేని కుటుంబాలను గుర్తించే పనిలో నిమగ్నమైన అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్) : ఉపాధిహామీ కూలీలకు 'ఆత్మీయ భరోసా' పథకం కింద ఏడాదికి రూ.12వేలు అందించేందుకు అర్హులను గుర్తించే ప్రక్రియ వేగంగా నడుస్తోంది. 2023–24 సంవత్సరంలో 20 రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు ఎన్నో గ్రామీణాభివృద్ధి శాఖ గురువారం లెక్కలు తీసింది. జిల్లా వ్యాప్తంగా 85,526 కుటుంబాలు 20రోజుల ఉపాధిహామీ పనిదినాలు పూర్తి చేసుకున్నట్లు గుర్తించింది. అయితే ఈ కుటుంబాల్లో భూముల్లేని వారికి మాత్రమే 'ఆత్మీయ భరోసా' సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. ఇందుకు క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలన చేయనున్నారు. భూమి ఉన్న కుటుంబాలను జాబితా నుంచి తొలగించి, భూమి లేని అర్హులైన కుటుంబాల వివరాలను ప్రభుత్వానికి పంపనున్నారు. ఏడాదికి రూ.12 వేలు ఇవ్వనుండగా, మొదటి విడతగా త్వరలోనే రూ.6 వేలు సంబంధిత కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేయనుంది ఈ నేపథ్యంలో లబ్ధిదారుల వివరాలు, బ్యాంకు ఖాతాలు తప్పుగా లేకుండా గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది. మరోసారి బ్యాంకు, ఆధార్ కార్డుల జిరాక్స్‌లను లబ్ధిదారుల నుంచి సేకరిస్తోంది. సేకరించిన వివరాలను ఒకటికి రెండుసార్లు సరిచూసుకుని ప్రభుత్వానికి పంపుతారు. 20 రోజులు పనిదినాలు పూర్తి చేసుకుని భూమి లేని పేద కుటుంబాలు సుమారుగా 43వేలకు పైగా ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ

కామారెడ్డి టౌన్/ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని అన్ని ఆర్టీసీ డిపోలలో నేడు డయల్ యువర్ ఆర్టీసీ ఆఫీసర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరా, నిజామాబాద్ ఆర్ఎం జ్యోత్స్న వేర్వేరుగా ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4గం.ల నుంచి నుంచి 5గం.లకు వరకు జరిగే ఈ కార్యక్రమం కొనసాగనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు స్థానిక ఆర్టీసీ డిపోలలో నెలకొన్న సమస్యలను, సలహాలను, సూచనలను కింది ఫోన్ నెంబర్‌లను సంప్రదించాలని తెలిపారు.

రీజనల్ మేనేజర్, నిజామాబాద్	9959226011
డిపో మేనేజర్, నిజామాబాద్-1	9959226016
డిపో మేనేజర్, నిజామాబాద్-2	9959226017
డిపో మేనేజర్, ఆర్మూర్	9959226019
డిపో మేనేజర్, బోధన్	9959226001
డిపో మేనేజర్, కామారెడ్డి	9959226018
డిపో మేనేజర్, బాన్సువాడ	9959226020

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి



కామారెడ్డి క్రైం: పట్టణ శివారులోని క్యాసంపల్లి క్రాస్ రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. దోమకొండ మండలం లింగుపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య (67) ఆస్పత్రిలో ఉన్న తన బంధువును పరామర్శించేందుకు టీవీఎస్ ఎక్సెల్‌పై ఉదయం కామారెడ్డికి వచ్చాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్తుండగా క్యాసంపల్లి క్రాస్ రోడ్డు వద్ద అతడిని వెనుకనుంచి వేగంగా వచ్చిన పల్సర్ బైక్ ఢీకొంది. ఈఘటనలో అతడి తలకు బలమైన గాయం కావడంతోఅక్కడికక్కడే మృతి చెందాడు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

కామారెడ్డి క్రైం: పట్టణ శివారులోని జాతీయ రహదారి బ్రిడ్జిపై ఓ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. వివరాలు ఇలా.. పట్టణంలోని బతుకమ్మకుంట కాలనీలో నివాసం ఉంటున్న మహమ్మద్ ఖాసీం (56) జీఎంఆర్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే సిరిసిల్లా రోడ్డుపై ఉన్న జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద రేలింగ్ ఏర్పాటు పనులకు హాజరయ్యాడు. ఈక్రమంలో నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి అతడిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మృతుడి భార్య సుల్తానా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

మురికికాలువలో పడి ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆదర్శనగర్‌కు చెందిన చౌహాన్ పీరాజీ(45) మురికికాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై హరిబాబు గురువారం తెలిపారు. చౌహాన్ పీరాజీ ఈనెల 12న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి కుటుంబసభ్యులు మిస్సింగ్ అయినట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం మైసమ్మ కమాన్ వద్ద గల మురికికాలువలో అతడు మృతి చెందినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించామని పేర్కొన్నారు.

ఆలయాల్లో చోరీల ముఠా అరెస్ట్

- రూ.4 లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ చైతన్య రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్య రెడ్డి



స్వాధీనం చేసుకున్న వాహనాలు

కామారెడ్డి క్రైం: కొద్ది రోజులుగా ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు ఆలయాలు, ఇతర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగల ముఠాను కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి వివరాలు వెల్లడించారు. కామారెడ్డికి చెందిన నిమ్మలవోయిన సురేష్, నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం నడిపల్లి గ్రామానికి చెందిన రుద్రబోయిన గణేష్, ఎడపల్లి మండలం తాడెం గ్రామానికి చెందిన గాజుల శ్రీధర్ హౌసింగ్ బోర్డు ప్రాంతంలో గురువారం అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో దొంగతనాల వ్యవహారం బయటపడింది. తామే చోరీలకు పాల్పడ్డట్టు వారు అంగీకరించారని ఏఎస్పీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో ఉన్న ఐదుగుడుల ప్రాంగణంలోగల సాయిబాబా ఆలయంలో ఈనెల 10న దొంగలు చొరబడి సౌండ్ బాక్స్, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. అశోక్‌నగర్‌తోపాటు భిక్కనూరు, దేవునిపల్లి, ఎడపల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న ఒక్కో ఆలయంలో చోరీలతో పాటు మరికొన్ని చోట్ల ఒక ఆటో, మూడు బైకులు, రెండు చోట్ల మేకల దొంగతనాలు, ఇలా ఈ ముగ్గురూ కలిసి మొత్తం 11 చోరీలకు పాల్పడినట్లు తేలిందని వివరించారు. నిందితులు ముగ్గురూ పాత నేరస్తులు. గతంలో వీరిపై అనేక దొంగతనాల కేసులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి ఆయా కేసుల్లో చోరీ చేసిన మూడు గ్రాముల బంగారం, మూడు బైక్‌లు, ఒక ఆటో, ఏడు జతల వెండి కళ్లు, ట్రాక్టర్ బ్యాటరీ, రెండు మైక్ సెట్‌లు, సెల్‌ఫోన్, ఒక మేకను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. వాటి విలువ మొత్తం రూ. 4లక్షలు వరకు ఉంటుందన్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సైలు బాల్‌రెడ్డి, శ్రీరామ్, రాజారామ్, వినయ్ సాగర్, దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది విశ్వనాథ్, విజయ్, రాజు, రామస్వామి, అనిల్ రెడ్డి, నరేష్, రవి, నవీన్‌లను అభినందించారు.

యువతిని వేధించిన ఐదుగురిపై కేసు..

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని సిద్దాపూర్ గ్రామానికి చెందిన ఓ యువతిని బుధవారం రాత్రి వన్నెల్ కే, సిద్ధాపూర్ గ్రామాలకు చెందిన ఐదుగురు యువకులు కలిసి వెంటపడి వేధిస్తూ దాడికి పాల్పడ్డారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సాయిరాం, రాహుల్, విగ్నేష్, సృజన్, సాయికిరణ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని ఇద్దరు వ్యక్తులు వేర్వేరు కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగారంలోని వడ్డెరకాలనీకి చెందిన మక్కల లక్ష్మణ్(29) అప్పుల బాధ భరించలేక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే మోపాల్ మండలం నాల్యకల్ గ్రామానికి చెందిన శ్యామ్‌రావు(55) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్యామ్‌రావు చిన్నకుమారుడు అయ్యప్పమాల ధరించడంతో అతడిచి మద్యం తాగడానికి వీలులేకుండాపోయింది. దీంతో అతడు మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతుల కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న పసుపు బోర్డు జాతీయ అధ్యక్షుడు పల్లెగంగారెడ్డి

ఆర్మూర్‌టౌన్:క్రీడకారులు తాము ఎంచుకున్న క్రీడల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎదగాలని పసుపు బోర్డు జాతీయ అధ్యక్షుడు పల్లెగంగారెడ్డి అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో గురువారం ఎమ్మెల్యే క్రికెట్ కప్ టీ–10 టెన్నిస్‌బాల్ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ కార్యకర్తలు క్రికెట్ కప్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందయనీమన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. విజేతకు రూ. 50వేలు, రన్నరప్‌కు రూ. 25వేలు బహుమతి అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాయకులు లోక భూపతిరెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, కంచెట్టి గంగాంధర్, జెస్సు అనిల్,పాలేపురాజు, ఆకుల రాజు, రంగన్న, మందుల బాలు, బాశెట్టిరాజ్‌కుమార్, పులియుగేంధర్, గుర్రం విజయానంద్ పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ల హల్‌చల్

- జంగంపల్లిలో 3తులాల బంగారు చైన్ అపహరణ
- ఆర్గొండలో చైన్ స్నాచింగ్‌కు యత్నం



సీసీ ఫుటేజీలో రికార్డయిన అనుమానితులు

భిక్కనూరు/రాజంపేట: భిక్కనూరు, రాజంపేట మండలాల్లో గురువారం పట్టపగలే చైన్‌స్నాచర్లు హల్‌చల్ చేశారు. జంగంపల్లి శివారులో ఓ మహిళ మెడలోనుంచి బంగారు గొలుసును దుండగులు అపహరించగా, ఆర్గొండలో ఓ మహిళ మెడలోనుంచి గోల్డ్‌చైన్‌ను దొంగిలించడానికి యత్నించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. రామారెడ్డి చెందిన మనెమ్మ తన కుమారుడు భాస్కర్‌తో కలిసి బైక్‌పై రాజంపేట మండలం తలమడ్లలోని బంధువుల ఇంటికి వచ్చింది. గురువారం మధ్యాహ్నం తిరిగి స్వగ్రామానికి బయలుదేరగా, జంగంపల్లి సమీపంలో వెనుకవైపు నుంచి గుర్తుతెలియని వ్యక్తులు వీరి వద్దకు వచ్చారు. వారిని బస్వన్నపల్లి గ్రామానికి దారి కోసం అడిగి మనెమ్మ మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడును తెంపుకుని వేగంగా బైక్‌పై తలమడ్ల వైపు పారిపోయారు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు. చైన్ స్నాచింగ్ అనుమానితుల ఫొటోలను పోలీసులు విడుదల చేశారు.

రాజంపేట మండలంలో..

రాజంపేట మండలం ఆర్గొండ గ్రామంలో గుర్తుతెలియని దుండగులు గుండారం వైపు వెళ్తున్న ఆటోను వెంబడించి ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీకి యత్నించినట్లు తెలిసింది. ఆటోలో ఉన్న మహిళ మెడలోని గొలుసును బైక్ పైనుంచి దుండగులు తెంపేందుకు యత్నించగా ఆటోలో ఉన్న ప్రయాణికులు గమనించారు. వెంటనే దుండగులు కామారెడ్డి వైపు పరారైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయపై గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు.

చైన్ స్నాచర్ల అరెస్టు



మాట్లాడుతున్న ఎస్సై హరిబాబు

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతమ్‌నగర్‌లో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై హరిబాబు గురువారం తెలిపారు. వివరాలు ఇలా.. ఈనెల 4న నిందితులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులు సాయి, కీర్తిరాజ్‌లను గుర్తించి వారిని పట్టుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఒకరు..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో నాలుగురోజులక్రితం జరిగిన హత్యాయత్నం ఘటనకు సంబంధించి ఒకరిని అరెస్టు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. గ్రామశివారులోని శిఖంభూమిలో పంటలసాగు విషయమై ఈ నెల 13న పలువురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనపై వెంకంపల్లికి చెందిన చిలుకూరి సురేందర్ రెడ్డి నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు గ్రామానికి చెందిన ఆకిడి జమాకర్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. రిమాండ్‌కు తరలించినట్లు నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

- వీడిన బుస్సాపూర్ మర్డర్ మిస్టరీ
- రెండు రోజుల్లోనే ఛేదించిన పోలీసులు
- వివరాలను వెల్లడించిన రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్‌లో ఇటీవల చోటుచేసుకున్న దిలీప్‌శర్మ హత్య ఘటన అక్రమ సంబంధం కారణంగానే జరిగిందని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. కేసును రెండు రోజుల్లోనే ఛేదించి, నిందితులను గురువారం అరెస్టు చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బుస్సాపూర్‌కు చెందిన శ్రీకర్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తుండగా, కోడిచర్లకు చెందిన అక్షయ ఓ ప్రయివేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తుంది. వీరిద్దరికి వివాహం కాలేదు. సన్నిహిత సంబంధం ఉంది. కానీ అంతకుముందు నుంచే అక్షయకు దిలీప్‌శర్మతో వివాహేతర సంబంధం ఉంది. దిలీప్‌శర్మ, శ్రీకర్ బుస్సాపూర్‌లోనే ఉండటంతో ఇద్దరి మధ్య స్నేహం కుదిరింది. ఈక్రమంలో అక్షయను వదిలేయమని శ్రీకర్‌ను దిలీప్‌శర్మ పలుమార్లు బెదిరించాడు. సోమవారం దిలీప్‌శర్మ ఇంట్లో ఎవరు లేకపోవడంతో అక్షయను తీసుకుని తన నివాసానికి రావాలని శ్రీకర్‌కు సూచించగా, వెళ్లారు. ఈక్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఎలాగైన దిలీప్‌శర్మను వదిలించుకోవాలనుకున్న అక్షయ కూడా శ్రీకర్‌కే మద్దతు పలుకుతూ ఇద్దరు కలిసి సిమెంట్ ఇటుకలతో తలపై మోదీ దిలీప్‌శర్మను హత్య చేశారు. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సైలు నారాయణ, నరేష్, సిబ్బందిని సీఐ అభినందించారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలుశిక్ష

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనాలు నడిపిన 18మందికి సెకండ్ క్లాస్‌మేజిస్ట్రేట్ జైలుశిక్ష విధించినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి గురువా రం తెలిపారు. ఇటీవల నిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలలో వా హనాదారులకు డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈక్రమంలో పట్టుబడ్డవారికి అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి, కోర్టులో హాజరు పర్చగా వారికి స్పెషల్ జ్యుడీషియర్ 2వ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహన్ బేగం శిక్షలు విధించినట్లు తెలిపారు. నగరంలోని రెండవటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎండీ ఆసాద్ హైమద్, ఐదవటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోపాల్ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన బద్ది భూమయ్య, అలాగే కంజరకు చెందిన అదం గిరి సాయిలు, తాణాకుర్దుకు చెందిన సీహెచ్ స్వామిగౌడ్, నిజామాబాద్ రూరల్ పరిధిలోని ఆదర్శనగర్‌కు చెందిన దయాకర్, మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒడ్యాట్‌పల్లికి చెందిన చిన్న ఒడ్డెన్నకు ఒక రోజు జైలు శిక్ష విధించారన్నారు. అలాగే పిప్రికి చెందిన చాచేవార్ ప్రదీప్, నిజామాబాద్ రూరల్ పీఎస్ పరిధిలోని మారుతినగర్‌కు చెందిన ప్రకాశ్ నారాయణ్,నిజామాబాద్ రూరల్ పీఎస్ పరిధి లోని గౌతంనగర్‌కు చెందిన భూమయ్య, మోపాల్‌కు చెందిన ఇంధూర్ నాగరాజు, సిరికొండకు చెందిన బండి విజయ్, ఎండ్ల రాకేష్, దు బ్బాక రాజ్ కుమార్,బండెల ధర్మపురి, మండలంలోని పెద్దవాల్గొట్‌కు చెందిన అల్లెపు రమేష్, కొండూర్‌కు చెందిన సాయి, పందిమడుగుకు చెందిన సుంకవక్క నర్సయ్య, చిన్నవాల్గొట్‌కు చెందిన బదాల భాస్కర్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. అలాగే నగరంలోని ఆర్ఆర్ చౌరస్తా వద్ద డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నామని ఎస్సై యాసీన్ ఆరాఫత్ గురువారం తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికీ రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించగా, ఒకరికి ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

సిరికొండ: మండల పోలీస్ స్టేషన్‌లో ఇటీవల నమోదైన పలు కేసుల్లో పలువురికి రెండు రోజుల జైలు శిక్షను ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దత్తు గంగాధర్ విధించారని ఎస్సై రామ్ గురువారం తెలిపారు. డయల్ 100కు తప్పుడు ఫిర్యాదు చేసిన బండి మహేష్, బండి అశోక్‌కు, జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారని తెలిపారు.